విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 31, ఆగస్టు 2023

వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా జయచంద్రారెడ్డి

విశాలాంధ్ర - అవుకు : నంద్యాల జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా అవుకు పట్టణానికి చెందిన ముడియాల జయచంద్ర రెడ్డి నియమితులయ్యారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే కాక రాష్ట్ర రాజకీయాలలోనే తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న స్వర్గీయ శాసనమండలి సభ్యులు చల్లా రామకృష్ణారెడ్డి వ్యక్తిగత కార్యదర్శి, స్వర్గీయ శాసనమండలి చల్లా భగీరథ్ రెడ్డిల సలహాదారుడే ముడియాల జయచంద్రారెడ్డి. గత 30 సంవత్సరాలుగా చల్లా రామకృష్ణారెడ్డికి వ్యక్తిగత కార్యదర్శిగా ఆయన ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీలో ముఖ్య భూమికను పోషించేవాడు. గత ఎన్నికలలో కాటసాని రామిరెడ్డి గెలుపులో చల్లా రామకృష్ణారెడ్డి కీలక పాత్ర పోషించగా, చల్లా రామకృష్ణారెడ్డి ఆదేశిస్తే జయచంద్ర రెడ్డి ఆచరణలో అమలు చేసేవాడు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ముడియాల జయచంద్ర రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి పాణ్యం శాసన సభ్యుడు కాటసాని రాంభూపాల్ రెడ్డికి, బనగానపల్లి శాసనసభ్యుడు కాటసాని రామిరెడ్డికి మరియు చల్లా కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతూ వారికి రుణపడి ఉంటానని అన్నారు. పార్టీలో అంకితభావంతో ఏ స్థాయిలో పనిచేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పెద్దలు వారి సేవలు గుర్తించి పదవులు ఇవ్వడం జరుగుతుందనే దానికి నేనే ఉదాహరణ అని అన్నారు. చల్లా రామకృష్ణారెడ్డి మరియు చల్లా భగీరథ్ రెడ్డి లను స్మరించుకుంటూ పార్టీ ఇచ్చిన పదవి గొప్ప గుర్తింపుగా భావించి పార్టీకి విధేయుడుగా, అంకితభావంతో, బాధ్యతాయుతంగా పనిచేస్తానని అన్నారు. రాబోయే ఎన్నికల్లో జిల్లాలోని అన్ని స్థానాలలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించుకునేందుకు జిల్లా నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకొని అభ్యర్థుల గెలుపుకు అహర్నిశలు కృషి చేస్తానని అన్నారు.

రైతుల రాష్ట్ర సదస్సుకు అఖిలపక్ష పార్టీల నాయకులు హాజరు... !

విజయవంతం చేయాలని రైతులకు పిలుపిచ్చిన సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు

విశాలాంధ్ర - నంద్యాల : సాగునీరు, త్రాగునీరు సాధనకై సిపిఐ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న నిర్వహించనున్న రాష్ట్ర సదస్సుకు అఖిలపక్ష పార్టీల నాయకులు హాజరవుతున్నారని రైతులు, ప్రజలు విరివిగా పాల్గొని విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు పిలుపునిచ్చారు. సిపిఐ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యంగా వెనుకబడిన రాయలసీమ అభివృద్ధికి సాగునీరు, తాగునీరు సాధనకై సెప్టెంబర్ ఒకటోతేదీన నంద్యాల పట్టణంలోని మున్సిపల్ టౌన్ హాల్ నందు ఉదయం 11 గంటలకు సదస్సు ప్రారంభమవుతుందని, ఈ సదస్సుకు అఖిలపక్ష రాజకీయ పార్టీల రాష్ట్ర నేతలు హాజరు కావడం జరుగుతుందన్నారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ శాసనసభ్యులు కె.రామకృష్ణ, టిడిపి పోలిట్ బ్యూరో మెంబర్, మాజీ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ శాసనసభ్యులు ఎంఎ గఫూర్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్. తులసిరెడ్డి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాల నాగేశ్వరరావు, రాయలసీమ సాగునీటి సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు బొజ్జ దశరథ రామిరెడ్డి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి. రామచంద్రయ్య, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు జి. ఓబులేసు, డి జగదీష్, ప్రజాసంఘాల రాష్ట్ర నేతలు హాజరుకానున్నారని నంద్యాల జిల్లాలోని రైతాంగం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి రంగనాయుడు పిలుపునిచ్చారు.

కరువు మండలాలుగా ప్రకటించాలి

ప్రతి ఎకరాకు 30వేలు పంట నష్టపరిహారం అందించాలి : సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు

విశాలాంధ్ర - డోన్ : నియోజకవర్గ మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి,ప్రతి ఎకరాకు 30వేలు పంట నష్టపరిహారం అందించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజ నేయులు డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధిలోని దొరపల్లె గ్రామంలో రైతులు సాగు చేసిన వేరుశనగ,కంది, ఆముదం,సజ్జలు పంటలను పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ పంటలేసి దాదాపు రెండు నెలలు అవుతున్న ప్పటికీ వర్షాలు సకాలంలో కురవకపోవడం వల్ల వేసినటు వంటి పంటలు పెరగాక నేలమట్టానికే పరిమితమయ్యా యన్నారు. అధికారులు పంట పొలాలకు వెళ్లి పంటలను పరిశీలించి ప్రతి ఎకరాకు 30 వేల పంట నష్టపరిహారం రైతు అకౌంట్లో జమ చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు పంటల సాగుకు ఉచితంగా సరిపడ విత్తనాలు ప్రభుత్వం ఇవ్వాలన్నారు.పంటలు లేక వలసలు వెళ్లేటువంటి పరిస్థితి ఏర్పడిందన్నారు. అందుకే నవంబర్ నెల నుంచి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు ప్రారంభించి రైతులు వలసలు వెళ్లకుండా స్థానికం గానే ఉపాధి పనులు కల్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.పంట పెట్టుబడికి తెచ్చుకున్న బ్యాంకుల్లో అప్పుల ను పూర్తిస్థాయిలో మాఫీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఆయనతోపాటు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి సుంకయ్య, సిపిఐ మండల కార్యదర్శి ఎస్. పులి శేఖర్, బి. నారాయణ ,దొరపల్లె శాఖ కార్యదర్శి కొండయ్య,నాగరాజు ,గౌడ్ తోపాటు మహిళా రైతులు పాల్గొన్నారు.

నేడు మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రమాణస్వీకారం

విశాలాంధ్ర - నందికొట్కూరు : నందికొట్కూరు నియోజకవర్గ మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రమాణ స్వీకారం నేడు పట్టణంలోని స్థానిక చాముండి ఫంక్షన్ హాల్ నందు నిర్వహించడం జరుగుతుందని మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ శివరామకృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆశీస్సులతో షాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి నాయకత్వంలో నందికొట్కూరు నూతన మార్కెట్ యార్డ్ చైర్పర్సన్ గా షేక్ రాహత్ జబ్బార్ మరియు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ల ప్రమాణ స్వీకారోత్సవానికి నియోజవర్గంలోని ప్రతి ఒక్కరికి ఆహ్వానం పలకడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నంద్యాల ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి, ఏపీ షాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, కర్నూలు ఎమ్మెల్యే ఆఫీస్ ఖాన్, ఎమ్మెల్సీ ఈసాక్ బాషా రావడం జరుగుతుందన్నారు. కాబట్టి నియోజవర్గంలోని మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు,అన్ని మండలాల జడ్పిటిసిలు, ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి అభిమానులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

జిల్లాను క్రాప్ హాలిడే గా ప్రకటించాలి

విశాలాంధ్ర - నంద్యాల : ఖరీఫ్ సీజన్లో పడవలసిన వర్షాలు సరైన సమయములో పడక, కేసీ కెనాల్ కు నీరు విడుదల చేసినా అన్ని మండలాలలో రైతులు వేసిన పంటలకు నీరు సరిగా అందకపోవడం వలన పంటలు ఎండిపోతున్నాయని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నంద్యాల జిల్లా కో కన్వీనర్ జి. సోమన్న ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమన్న మాట్లాడుతూ ఇప్పటికే వేసిన మొక్కజొన్న మిరప నీరు లేక రైతులు ట్రాక్టర్లతో పొలాలను దున్ని వేయడం జరిగిందన్నారు. కొందరు రైతులు వేసిన పంటలను చెడగొట్టుకోలేక ట్రాక్టర్ల ద్వారా పంట పొలాలకు నీరందిస్తూ ఉన్నారని, విత్తనం వేసినప్పటినుంచి ఇంతవరకు రైతులు పంట పొలాలను కాపాడుతూ వస్తున్నప్పటికీ సరైన సమయంలో వర్షాలు లేక రైతుల ఆశలు ఆడియాశలుగా మారాయన్నారు. రైతులు పెట్టిన పెట్టుబడి రాదేమో అని నిరాశకు గురవుతున్నారని, కాబట్టి ప్రభుత్వము అన్ని పంటలకు ఈఎంఈవై పంటల బీమా సౌకర్యం కల్పించి జిల్లాలోని రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నంద్యాల జిల్లాలోని డోన్ ప్రాంతంలో రైతుల పరిస్థితి మరి దారుణంగా ఉందని, అలాగే బనగానిపల్లి, ఆళ్లగడ్డ, చాగలమర్రి, సిరివెళ్ల, పాణ్యం గడివేముల ఆత్మకూరు కొత్తపల్లి, నందికొట్కూర్ మండలాల రైతులను, కౌలు రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని సోమన్న కోరారు.

భూములు పోయి పరిహారం అందని రైతులు ఆధారాలు సమర్పించండి..

విశాలాంధ్ర - పాములపాడు : కర్నూల్ నుండి అమరావతికి వెళ్లే 340 జాతీయ రహదారి కింద భూములు పోయిన పాములపాడు, రుద్రవరం, జూటూరు, కమ్మలపల్లె, ఎర్ర గూడూరు భానుముక్కల గ్రామాల రైతులకు సంబందించిన పరిహారం కొరకు ఆధారాలు సమర్పించాలని తాసిల్దార్ రత్న రాధిక బుధవారం ప్రకటనలో తెలిపారు,గతంలో తాసిల్దార్ కార్యాలయం మరియు ఏఎన్నార్ జడ్పీ ఉన్నత పాఠశాల ఎందు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి రైతుల నుండి భూములకు సంబంధించిన ఆధారాలు సేకరించడం జరిగింది, కొందరు రైతులకు నష్టపరిహారం రైతుల ఖాతాలో జమ కాగా ఇంకొందరికి పెండింగ్లో ఉన్నాయని అందులో జూటూరు గ్రామంలో 40, రుద్రారం 39, పాములపాడు 22, కంబాలపల్లె 3, ఎర్రగుడూరు 64, భానుమకుల 3 గ్రామాల రైతుల సంబంధించి నష్టపరిహారం జమ కాలేదని నష్టపరిహారం జమకాన్ని రైతులు తమ పొలాలకు సంబంధించి ఆధారాలును తాసిల్దార్ కార్యాలయం నందు గాని గ్రామ సచివాలయంలోని విఆర్ఓ గాని సమర్పించాలని తాసిల్దార్ రత్న రాధిక తెలిపారు.

పల్లె ప్రజలకు రక్ష ఫ్యామిలీ డాక్టర్ సేవ

విశాలాంధ్ర - రుద్రవరం : పల్లె ప్రజలకు రక్ష ఫ్యామిలీ డాక్టర్ సేవలు ఎంతో ఉపయోగపడతాయని ఆలమూరు ప్రాథమిక వైద్యాధికారి అమర్నాథ్ రెడ్డి తెలిపారు.బుధవారం ముత్తలూరు సచివాలయ పరిధిలోని నల్లవాగుపల్లి గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ బీపీ ,షుగర్, సీజనల్ వ్యాధులు, సంబంధించి 104, మందికి వైద్య సేవలు అందించడం జరిగిందన్నారు. అలాగే వారికి ఉచితం గా మందులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఇళ్లలోనే మంచాలపై ఉన్న వృద్ధ మహిళలకు పురుషులకు వారి ఇంటి దగ్గరికి వెళ్లి వైద్యం అందించడం జరిగిందన్నారు.అలాగేవ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని పౌష్టిక ఆహారం తీసుకోవాలని సూచించడం జరిగిందన్నారు. అనంతరం గ్రామంలోని అంగన్వాడి కేంద్రాన్ని తనిఖీ చేసి చిన్నారులకు ఆహారము, వారు పాటించాల్సిన ఆరోగ్య సూత్రాలు, నాణ్యత, విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రత, ఇతర అంశాలపై చిన్నారులకు అవగాహన కల్పించారు,వైద్య శిబిరంలో హెల్త్ సిబ్బంది హెల్త్ ఎడ్యుకేటర్ రత్నాలు, ఎం.ఎల్.హెచ్. పి,సుస్మిత రాణి, ఏఎన్ఎం హేమలత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అభాగ్యులకు సహాయం సంతోషకరం...

విశాలాంధ్ర - డోన్ రూరల్ : అభాగ్యులకు సహాయం చేయడం సంతోషమని సిఐ ప్రవీణ్ కుమార్ అన్నారు. పట్టణంలోని షాధిఖానలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన జెసిబి డ్రైవర్ గిరి కుటుంబానికి ద్రోణాచలం సేవా సమితి, ఎస్కేపి పూర్వ విద్యార్థులు, రైల్వే సేవా సమితి, కేవీయస్ వైద్యశాల సహకారంతో దాదాపు లక్ష ఇరవై వేల రూపాయల సహాయం అందించడం వల్ల ప్రమాదంలో చనిపోయిన కుటుంబానికి ఆర్థికంగా ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. అలాగే చేయూత స్వచ్ఛంద సేవ సంస్థ ద్వారా 48 వేల రూపాయలు ఇవ్వడం ద్వారా గిరి కుటుంబంలోని చిన్న పిల్లలకు మంచి జరుగుతుంది తెలిపారు. ఈ సమావేశంలో పారిశ్రామికవేత్త జయశీలన్ గుప్త, ఎ స్సిఐ రఘు, రామానాయుడు, కరుణాకర్, ట్రైలర్ భాష, గుర్రం మధు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డుకు భూమి పూజ

విశాలాంధ్ర - బనగానపల్లి: మండలంలోని పలుకూరు గ్రామంలో సిమెంట్ రోడ్డుకు వైసీపీ రాష్ట్ర కార్యదర్శి గుండం శేషిరెడ్డి భూమి పూజ చేశారు. పలుకూరు గ్రామంలో శేషి రెడ్డి డిఎంఎఫ్ నిధుల ద్వారా సింగారప్ప అనంతమ్మ ఇంటి నుండి రామాయణం శ్రీనివాసులు ఇంటి వరకు 15 లక్షల రూపాయలవ్యయంతో సిమెంట్ రోడ్డు నిర్మాణం కొరకురోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. గుండం శేషిరెడ్డి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు.

మోదీ నుండి దేశాన్ని,జగన్మోహన్ రెడ్డి నుండి రాష్ట్రాన్ని రక్షించుకుందాం

విశాలాంధ్ర-డోన్:దేశ ప్రధాని నరేంద్ర మోడీ నుండి ఈ దేశాన్ని కాపాడుకుందామని,జగన్మోహన్ రెడ్డి రాక్షస పాలన నుండి రాష్ట్రాన్ని రక్షించుకుందామని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి.సుంకయ్య,ఏఐటీయూసీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు లక్ష్మీనారాయణలు అన్నారు. ఆగస్టు 17వ తేదీ నుండి సెప్టెంబర్ 8వ తేదీ వరకు కొనసాగుతూ,సిపిఐ బస్సు యాత్ర 3 వతేదినా జయప్రదం చేయాలని బుధవారం స్థానిక నక్కి రామన్న భవన్ నందు ఏఐటీయూసీ అనుబంధ సంఘాల సమావేశం పుల్లయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నరేంద్ర మోడీ అధికారం చేపట్టిన తర్వాత దేశంలో దళితులపైన, గిరిజనుల పైన, మహిళల పైన దాడులు అత్యాచారాలు పెచ్చరిల్లిపోతున్నాయని వారు పేర్కొన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను నాలుగు కోట్లుగా విభజించి కార్మిక హక్కులను కాలరాస్తున్నడని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి రాజధానిని ఏర్పాటు చేయకుండా వికేంద్రీకరణ పేరుతో మూడు రాజధానులు అంటూ జపం చేస్తూ రాష్ట్రాన్ని అధోగతి పాలు చేస్తున్నాడని ఆయన విమర్శించారు. అనంతరం జీపు జాతను జయప్రదం చేయాలని స్కూటర్ ర్యాలీని చేపట్టారు. ఈ స్కూటర్ ర్యాలీని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సుగుణమ్మ జండా ఊపి ప్రారంభించారు. స్థానిక శృంగారపు జిన్నింగ్ సెంటర్ నుండి బైకు ర్యాలీని ప్రారంభించి టాకీస్ రైల్వే గేట్లు, పాత బస్టాండ్ మీదుగా కొత్త బస్టాండ్ తారకరామా నగర్, కోర్టు రోడ్డు రైల్వే స్టేషన్ వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు అన్వర్,వెంకటేష్ గౌడ్,జులేఖ,రెహమత్ బి,రాము,భాస్కర్,కృష్ణ,గఫూర్ ప్రసాద్ పాల్గొన్నారు.

బస్సుయాత్రను జయప్రదం చేయండి

ఈనెల 17 నుండి సెప్టెంబర్ 8వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా సిపిఐ తలపెట్టిన బస్సు యాత్రను జయప్రదం చేయాలని ఈరోజు డోన్ పట్టణంలోనే కొండపేట,వై ఎస్ శ్రీరామ్ రామనగర్ వార్డులు తిరుగుతూ సెప్టెంబర్ మూడవ తేదీన ఆదివారం రోజు డోన్ పట్టణానికి బస్సు యాత్రను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి బి.నారాయణ, కార్యదర్శి వెంకటేష్, శ్రీరామ నగర్ శాఖ కార్యదర్శి బాలమద్దయ్య, సహాయ కార్యదర్శి ఖాదర్, సహాయ కార్యదర్శి రామచంద్రుడు, నాగేశ్వరరావు ,మేరెమ్మ, హసీనా, భాష, వెంకటలక్ష్మి, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

వేగంగా నగర పంచాయతీ అభివృద్ధి

విశాలాంధ్ర - బేతంచర్ల రూరల్ : పట్టణ పరిధిలోని బేతంచెర్ల నగర పంచాయతీ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుందని నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలం రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం నందు చైర్మన్ చలం రెడ్డి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇటీవల ఏర్పడిన ఏమున్సిపాలిటీలలో జరగని అభివృద్ధి బేతంచెర్ల నగర పంచాయతీలో జరగడం అదృష్టమని, ప్రజలందరూ ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలని ఆయన అన్నారు. తొందర్లోనే నీటి సమస్య తీరబోతుందని,ప్రతి ఇంటికి స్వచ్ఛమైన మంచి నీరు అందించిన కృషి చేస్తున్నామని,అలాగే ప్రతి వీధిలో లక్షల రూపాయలు వెచ్చించి సిసి రోడ్లు,అవసరమైన మేర బీటి రోడ్లు, రోడ్లకు ఇరువైపులా కంప,ముళ్లపొదలను తొలగించడం, డ్రైనేజీలు శుభ్రపరచడం, వంటి ఎన్నో ప్రజా ఆమోగ్యమైన పనులను చేస్తూ, ప్రజలకు సౌకర్యవంతమైన పాలనను అందించేందుకు కృషిచేస్తున్నామన్నారు. కొలుములపల్లె రహదారిలో ఉన్న ఈద్గాకు కాంపౌండ్ వాల్, మౌలిక వసతుల కొరకు రూ.10 లక్షల రూపాయల నిధులను మంజూరు చేసినందుకు చైర్మన్ చలం రెడ్డికి,రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డికి ముస్లిం కౌన్సిల్ సభ్యులు ముబీనా,పర్వీన్, హుస్సేన్ బి, కో ఆప్షన్ సభ్యులు అబిదా,సునీల్,లు కృతజ్ఞతలు తెలియజేసి, తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సమావేశంలో కమిషనర్ రమేష్ బాబు, అధికారులు శేఖర్, అంజాద్ భాష, వెంకటేష్ నాయక్, మెప్మా అధికారి శ్రీదేవి, కౌన్సిలర్స్ మధు,అంజి, రామగోపాల్,విజయలక్ష్మి,కుమారి,కోఆప్షన్ సభ్యులుఎల్లయ్య, పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర - నంద్యాల : నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని 30వ వార్డు ఎమ్మెస్ నగర్ నందు 142వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం వార్డు ఇన్చార్జి రామచంద్రుడు, వార్డు కౌన్సిలర్ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పాల్గొన్నారు. ముందుగా వార్డు వైసిపి నాయకులు ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డికి గజమాలతో స్వాగతం పలికారు. వార్డు ప్రజలు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటిని వెంటనే పరిష్కరించాలని సంబందిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎంతో దృఢ సంకల్పంతో రాష్ట్ర అభివద్ధి కోసం ప్రవేశపెట్టిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ప్రజాదరణ పొందుతోందని, ప్రజా సంక్షేమం కోసమే గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల చైర్ పర్సన్ మాబునిసా, వార్డు వైసిపి నాయకులు కృష్ణారెడ్డి, రామకృష్ణ, సత్తార్,షరీఫ్, తులసి, దివాకర్, రవి, శంకర్, లోకేష్ ,మధు, చోటు, రాజేస్ వైసీపీ నాయకులు ఆదిరెడ్డి భాస్కర్ రెడ్డి సాయిరాంరెడ్డి పాల్గొన్నారు.

సస్యరక్షణ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు

విశాలాంధ్ర - రుద్రవరం : మిరప పంటను సాగు చేసిన వ్యవసాయ రైతులు సస్యరక్షణ పద్ధతులు పాటిస్తే మేలైన అధిక దిగుబడులను పొందవచ్చని జిల్లా వ్యవసాయ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ జయదేవ్ , వ్యవసాయ సస్యరక్షణ శాస్త్రవేత్త బాలరాజు లు అన్నారు. బుధవారం మండల పరిధిలోని నాగులవరం గ్రామంలో పచ్చిమిరప రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిరప పంటను సాగుచేసిన ప్రతి ఒక్కరూ జీవామృతాన్ని వాడటం వల్ల పంటలో తెగుళ్ల నివారణను అదుపులో ఉంచవచ్చు అన్నారు. మిరప పంట పొలం చుట్టూ మేరసాలు మూడు లేక నాలుగు జొన్న, సజ్జ ను విత్తుకుంటే పురుగుల నుండి తెగుల్ల నుండి పంటను రక్షించుకోవచ్చున్నారు. కార్యక్రమంలో ఉద్యాన శాస్త్రవేత్త ఆదినారాయణ, పశు విజ్ఞాన శాస్త్రవేత్త కృష్ణమూర్తి, ఏడిఏ సరళమ్మ, ఏవోలు చంద్రశేఖర రెడ్డి, శ్రీకృష్ణ , ఉద్యాన అధికారి సరేష్ కుమార్ రెడ్డి,ఏఈఓ రాజు, పలువురు రైతులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాల విమర్శలకు పార్లమెంట్ సమాధానం చెంపపెట్టు

విశాలాంధ్ర - ఉయ్యాలవాడ : రాష్ట్రంలో వైఎస్ఆర్సిపి ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలనపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలకు పార్లమెంటులో కేంద్ర మంత్రులు భారతదేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్ని రాష్ట్రాల కన్నా అగ్రస్థానంలో ఉందని సమాధానం ఇవ్వడం ప్రతిపక్షాలకు చెంపపెట్టు లాంటిదని ఆంధ్రప్రదేశ్ జలవనుల శాఖ ప్రభుత్వ సలహాదారుడు గంగుల ప్రభాకర్ రెడ్డి, నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచ బ్రహ్మానందరెడ్డిలు అన్నారు. బుధవారం మండల కేంద్రమైన ఉయ్యాలవాడలో రూ 9.50 కోట్లతో 6 కిలో మీటర్ల పొడువునా నూతనంగా నిర్మించనున్న తారు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో కనీవినీ ఎరగని రీతిలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రూ. 2.50 లక్షల కోట్లు సంక్షేమ పథకాల అమల్లో భాగంగా నేరుగా పేద ప్రజల లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. ఈ రహదారి పూర్తి అయితే ఉయ్యాలవాడ ప్రజల దశాబ్దాలనాటి కల నెరవేరుతుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయితీ డి ఈ లక్ష్మీనరసింహుడు, జడ్పిటిసి కసాని పుణ్యలక్ష్మిదేవి, ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ, వైయస్ఆర్సీపీ మండల కన్వీనర్ బుడ్డచంద్రమోహన్ రెడ్డి,వైసీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా తెలుగు భాషా దినోత్సవం

విశాలాంధ్ర - నంద్యాల : నంద్యాల పట్టణం సాయిబాబా నగర్ శ్రీ భగత్ సింగ్ జనచైతన్య విజ్ఞాన గ్రంథాలయంలో గిడుగు వెంకట రామమూర్తి జయంతి సందర్భంగా అభ్యుదయరచయితల సంఘం (అరసం) నంద్యాల శాఖ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నంద్యాల జిల్లా అరసం అధ్యక్షులు ముర్తుజా షేక్ కార్యక్రమానికి అధ్యక్షతవహించారు. గిడుగు వారి పటానికి పూలమాల వేసి తెలుగు భాషా దినోత్సవాన్ని వక్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక న్యాయవాది, సామాజిక సేవా కార్యకర్త బి. శంకరయ్య,గిద్దలూరు వాస్తవ్యులు, కవి షేక్ దస్తగిరి, అరసం శాఖ ప్రధాన కార్యదర్శి మద్దిలేటి, ఉపాధ్యక్షులు నీలకంఠమాచారి, ఉప కార్యదర్శి కవి మహమ్మద్ రఫీ, పాణ్యం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు పండితుల ప్రసాద్ తదితరులు తమ తమ ఉపన్యాసాలలో తెలుగు భాష వైభవానికి దివిటీలు పట్టారు. సాహితీ స్రవంతి జిల్లా కార్యదర్శి, సీనియర్ పాత్రికేయులు మాదాల శ్రీనివాసులు, శ్రీరామ్మూర్తి, మాధవరావు తదితరులు పాల్గొన్నారు. మహమ్మద్ రఫీ వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

ఎస్సార్బీసీ కాలువకు నీటి విడుదల

విశాలాంధ్ర - బనగానపల్లి : పోతిరెడ్డిపాడు నుంచి విడుదల చేసిన ఎస్ఆర్బిసి నీళ్లు బుధవారం నాడు బనగానపల్లెకు చేరుకున్నాయి. వర్ష భావ పరిస్థితులతో ఎండు దశలో ఉన్న మొక్కజొన్న, మినుము తదితర పంటలకు ఉపయోగకరంగా ఉంటాయని నీళ్లు విడుదల చేసినట్టు తెలుస్తుంది. ఎస్ఆర్బిసి ఈఈ చంద్రశేఖర్ రెడ్డిని వివరణ కోరగా ఎస్ ఆర్ బి సి కి 500 కీసెక్కులు నీళ్లు విడుదలైనట్టు తెలిపారు. ఎండిపోతున్న పంటల కొరకు కొన్ని రోజులు మాత్రమే నీళ్లు విడుదలైనట్లు తెలిపారు. ఎన్ని రోజులు నీళ్లు వస్తాయని స్పష్టత లేదని రైతుల గమనించి ఆరుతడి పంటలు మాత్రం సాగు చేసుకోవడం ఉత్తమం అన్నారు.

బీజేపీలో చేరుతున్నట్లు...ప్రచారం అవాస్తవం

విశాలాంధ్ర - ఆత్మకూర్ టౌన్ : తాను భారతీయ జనతా పార్టీ లో చేరుతున్నట్లు ఈ మేరకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డా ను కలిసినట్లు సామాజిక మాధ్యమాలలో వైరల్ అవుతున్న ప్రచారాన్ని మాజీ మంత్రి, టిడిపి నేత ఏరాసు ప్రతాప్ రెడ్డి ఖండించారు. ఈ మేరకు బుధవారం ఆత్మకూరు పట్టణంలోని ఓ హెూటల్ లో అయాన మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. సి.ఎం రమేష్ తో కలిసి తాను పార్లమెంట్ లో నడ్డా కలిసినట్లు ఫోటో మార్ఫింగ్ చేసి తనను ఓ వర్గానికి దూరం చెయ్యాలని కుట్ర జరుగుతుంది అని ఆరోపించారు. ఫోటో మార్ఫింగ్ పై సైబర్ క్రైమ్ కు పిర్యాదు చేసినట్లు తెలిపారు. తాను తెలుగుదేశం పార్టీని వీడేది లేదని వెల్లడించారు. తమ అంతిమ లక్ష్యం చంద్రబాబు నాయుడు ను ముఖ్యమంత్రి చేసుకోవడమే నని ఆయన ఎమ్మెల్యే టికెట్ ఇచ్చినా, ఇవ్వకున్నా పార్టీ గెలుపు నకు కృషి చేస్తానని అన్నారు. శ్రీశైలం నుంచి టికెట్ ఆశిస్తున్నానని, టికెట్ రాకపోయినా బుడ్డా రాజశేఖర రెడ్డి గెలుపునకు సహకరిస్తానని అన్నారు. 2024 ఎన్నికలు ప్రపంచ కప్ క్రికెట్ లాంటిది అని అందుకు కావలసిన ఆటగాళ్లను కెప్టెన్ చంద్రబాబు అచుతుచి బరిలో దింపుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో నూర్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

దస్తావేజు లేఖర్లు ఆందోళన

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్ : రిజిస్ట్రేషన్ శాఖలో ప్రభుత్వ నూతనంగా ప్రవేశపెట్టిన కార్డు ప్రైమ్ 2.0 విధానానికి వ్యతిరేకంగా దస్తావేజు లేఖర్లు బుధవారం పట్టణంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేసి సమ్మె చేపట్టారు. ఈసందర్భంగా దస్తావేజు లేఖర్లు కిరణ్ కుమార్, నాగేంద్రప్ప,శశిధర్లు మాట్లాడుతూ ప్రైమ్ 2.0 ద్వారా స్టాంపు రైటర్లు కనుమరుగయ్యే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దస్తావేజు లేఖర్లు అవసరం లేకుండా రూపొందించిన ఈ విధానం ద్వారా తప్పులు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. సాంకేతికతపై అవగాహన లేనివారు అమ్మకంకొనుగోలులో మోసపోయే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విధానాన్ని విరమించుకోకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దస్తావేజు లేఖర్లు మొహిద్దిన్, లింగమూర్తి, శ్రీను, రఘు, రజాక్, ఖదీర్, ఇమ్రాన్, పెద్ద భాష, చిన్న భాష, ప్రతాప్, రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకొనేందుకే పల్లెనిద్ర

విశాలాంధ్ర -చాగలమర్రి : గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొనెందుకే పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టినట్లు ఆళ్ళగడ్డ నియోజకవర్గ బిజెపి ఇన్చార్జ్ భూమా కిషోర్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నేలంపాడు గ్రామంలో ఆయన మంగళవారం పల్లెనిద్ర చేసి బుధవారం ఉదయం గ్రామంలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పల్లెనిద్రకు విచ్చేసిన భూమాకు అభిమానులు,నాయకులు,కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలో వీధి లైట్లు ఏర్పాటు చేయాలని కోరారని,సొంత నిధులతో ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామంలో సిసి రోడ్లు ఉన్న మురికి కాలువలు లేకపోవడం వల్ల వర్ష కాలం నీరు ఇళ్లలోకి వస్తున్నాయని ప్రజలు తెలిపారన్నారు. జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్ళి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన హామి ఇచ్చారు. కార్యక్రమంలో హరిచంద్రారెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి ,శంకర్ రెడ్డి, శివరామిరెడ్డి, బాలి రెడ్డి, దామోదర్ రెడ్డి, రమేష్, శ్యామ్సన్ , అజీరయ్య, రామాపురం భాష తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ మారుతి శంకర్ను సస్పెండ్ చేయాలి

విశాలాంధ్ర - నందికొట్కూరు : నందికొట్కూరు పట్టణంలో బుధవారం రూరల్ సర్కిల్ కార్యాలయం ఎదుట మిడుతూరు మండలం సుంకేసుల గ్రామానికి చెందిన ఎస్సీ సామాజిక వర్గ మాదిగ మహిళలపై గత డిసెంబర్ నెలలో అక్రమ కేసులు బనాయించి,మహిళలను అక్రమంగా రాత్రి 6 గంటల నుండి ఉదయం 6 గంటల వరకు స్టేషన్లో అక్రమ నిర్బంధంపై, ప్రస్తుతం యువకులపై రౌడీ షీట్ ఓపెన్ చేసినందుకు వ్యతిరేకిస్తూ ఎస్ఐ మారుతి శంకర్ చట్టాల విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారని తక్షణమే సస్పెండ్ చేయాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోనే అంబేద్కర్ సర్కిల్ నుండి రూరల్ సర్కిల్ కార్యాలయం వరకు నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం రూరల్ సర్కిల్ కార్యాలయం ముందు సుంకేసుల గ్రామ మాదిగ ప్రజలు తమకు న్యాయం చేసి ఎస్సై మారుతి శంకర్ను సస్పెండ్ చేయాలని నినాదాలతో నిరసన తో కూడిన ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాణిక్య రాజు, నాగరాజు, వివిధ మండలాల నాయకులు, సుంకేసుల గ్రామ మాదిగ ప్రజలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలు పెంచాలి

విశాలాంధ్ర - అవుకు : ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్యను పెంచాలి అని డిస్టిక్ హాస్పిటల్స్ కోఆర్డినేటర్ డాక్టర్ జఫ్రుల్ల అన్నారు. అవుకు పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం మరియు ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న సేవలు గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉప్పలపాడు, సామాజిక ఆరోగ్య కేంద్రము అవుకు సిబ్బందిచే సమావేశం నిర్వహించి అనంతరం ఆయన మాట్లాడుతూ మాతా శిశు మరణాలను తగ్గించే దిశలో భాగంగా ప్రతి గర్భిణీ స్త్రీ ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలు చేయించుకున్నట్లయితే తల్లి బిడ్డ క్షేమంగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్.టి.వినోద్ కుమార్, సామాజిక ఆరోగ్య కేంద్రం అవుకు డాక్టర్. రవికుమార్, డాక్టర్ .చాణిక్య డాక్టర్ .కళ్యాణ్ ,డాక్టర్ ఇంద్ర కళ్యాణి, ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మరియు అవుకు సామాజిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన సభ

విశాలాంధ్ర - నంద్యాల : నంద్యాల పట్టణ ఖాదర్ బాదర నర్సింగ్ మున్సిపల్ హైస్కూల్ నందు స్కూల్ హెడ్మాస్టర్ అసుదుల్లా హుస్సేన్, స్కూల్ స్టాఫ్ సెక్రటరీ వర ప్రసాద్ రెడ్డి, స్కూల్ ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. జిల్లాస్థాయి నంద్యాల స్పోర్ట్స్ అథారిటీ వారు నిర్వహించిన ఫుట్బాల్ గేమ్ నందు కేఎస్ఎం మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు గర్ల్స్ విభాగంలో విన్నర్స్ గాను, బాయ్స్ విభాగం నందు రన్నర్స్ గా నిలిచారు. విద్యార్థిని,విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

వేదావతి గర్జన సభను విజయవంతం చేయండి

సీపీఐ ప్రచార జీపు జాతలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య

విశాలాంధ్ర - ఆలూరు : సెప్టెంబర్ 2వ తేదీన ఆలూరు పట్టణంలో జరుగు వేదావతి గర్జన సభ విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య పిలుపునిచ్చారు. బుదువారం స్థానిక అంబేద్కర్ సర్కిల్లో సీపీఐ ప్రచార జీప జాతను సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాన్ని కాపాడండి రాష్ట్రాన్ని రక్షించండి అనే నినాదంతో ఈ నెల 17 నుండి ప్రారంభమైన సీపీఐ బస్సు యాత్ర ఆగస్టు 2వ తేదీన ఆలూరు పట్టణానికి చేరుకుంటుందన్నారు. ఈ బస్సు యాత్రలో సిపిఐ జాతీయ కార్యదర్శి కే.నారాయణ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే కే.రామకృష్ణ తో పాటు సిపిఐ రాష్ట్ర నాయకులు కూడా పాల్గొంటున్నట్లు తెలిపారు. ఆలూరు నియోజకవర్గం సస్య శ్యామలానికై వేదావతి సముద్రాభివృద్ధికి 8 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించారన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని, ఆస్పరి మండలాన్ని ప్రాజెక్టు పరిధిలోకి చేర్చి త్రాగునీరు సాగునీరు వర్తింపచేయాలని, దేవనకొండ మండలంలో సమీకరణ పనులను చేపట్టాలని, ఆలూరు పట్టణంలో 100 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేసి ప్రజలకు అన్ని విధాలుగా ఉపయోగపడే విధంగా ప్రభుత్వాసుపత్రిని అభివృద్ధి పరచాలని కోరారు. ఆలూరు, హలహర్వి, చిప్పగిరి మండలాలలోని గ్రామాలన్నిటి సీపీఐ జీపు జాత నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మద్దిలేటి శెట్టి, సిపిఐ జిల్లా సమితి సభ్యులు భూపేష్, సిపిఐ మండల కార్యదర్శి రామాంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం తాలూకా కార్యదర్శి రంగన్న, రైతు సంఘం తాలూకా నాయకులు చంద్రకాంత్ రెడ్డి, సిపిఐ మండల సమితి సభ్యులు రంగన్న, పులి రంగన్న, రాము, ఓబులేసు, నాగరాజు ,రామాంజి తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

విశాలాంధ్ర -హొళగుంద : తీవ్ర వర్షభావ పరిస్థితులవల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య,సీపీఐ మండల కార్యదర్శి మారెప్ప,రైతు సంఘం మండల కార్యదర్శి కృష్ణయ్య, మౌలా సాబ్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలో నష్టపోయిన పంట పొలాలను బుధవారం పరిశీలించారు. వర్షాలు కురవక ఎండిపోతున్న పంట పొలాలను సీపీఐ మండల సమితి ఆధ్వర్యంలో పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూన్, జులై మాసాలలో అరకొర వర్షాలు కురవడంతో పంటలు పెరగలేదని, ఆగస్టు మాసంలో అసలే వర్షాలు లేక పత్తి, వేరుశెనగ, సజ్జ, జొన్న, కంది, ఆముదం పంటలు ఏమాత్రం ఎదుగుదల లేక,పూత, కాయలు లేక ఏ మాత్రం పంట దిగుబడి వచ్చే పరిస్థితి లేదన్నారు. అందుకనే పంటలు సాగుచేసి నా రైతులను ఆదుకోవాలని అలాగే 60 సంవత్సరాల పైబడిన కౌలు రైతులకు నెలకు 5000 పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఇబ్రహీం సలాం సాబ్,హిమహిత్, మల్లికార్జున ,రుద్ర గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ పర్యటనను విజయవంతం చేయండి

విశాలాంధ్ర - ఆదోని : గవర్నర్ పర్యటనను విజయవంతం చేయాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పేర్కొన్నారు. బుదవారం మంత్రాలయం తహశీల్దారు కార్యాలయం నందు సంబధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ గౌరవ అబ్దుల్ నజీర్ ఆగష్టు 31, సెప్టెంబర్ 1వ తేది రెండు రోజుల పర్యటనలో భాగంగా మంత్రాలయం నందు శ్రీ గురు రాఘవేంద్ర స్వామి వారి ఆరాధన కార్యక్రమానికి విచ్చేస్తున్న సందర్భంగా ఏటువంటి పొరపాట్లు లేకుండా అధికారులు సమన్వయం తో విధులు నిర్వహించి విజయవంతం చేయాలని సంబంధిత అధికారులకు సబ్ కలెక్టర్ ఆదేశించారు.

తైక్వాండో పోటీల్లో నారాయణ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - కర్నూలు : ఈ నెల 26, 27వ తేదీలలో బెంగళూరులో జరిగిన వెస్టర్స్ కప్ మొదటి జాతీయ ఓపెన్ టైక్వాండో ఛాంపియన్షిప్ పోటీలలో కర్నూల్ నగరానికి చెందిన నారాయణ విద్యార్థులు బంగారు పతకాలను సాధించారు. బుధవారం కర్నూలు ఎమ్మెల్యే కార్యాలయంలో బంగారు పతకాలు సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, నారాయణ విద్యాసంస్థల ఎజిఎం రమేష్ కుమార్లు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు గోల్డ్ మెడల్ సాధించడం అభినందనీయమని అన్నారు. గొప్ప విజయాలను సాధించిన నారాయణ విద్యార్థిని, విద్యార్థులను అభినందించారు. పతకాలు సాధించిన వారిలో పదవ తరగతి విద్యార్థిని ఎంజి.ఇందిరా ప్రియదర్శిని, 9వ తరగతి విద్యార్థి డి.మహమ్మద్ షహల్ అష్రఫ్, 8వ తరగతి విద్యార్థి వై.హర్షవర్ధన్, ఐదవ తరగతి విద్యార్థిలు గోల్డ్ మెడల్ సాధించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ శ్రీనివాసరెడ్డి, దినేష్ కుమార్, అజీజ్, టైక్వాండో శిక్షకులు జి.షబ్బీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలి

విశాలాంధ్ర - ఆదోని : గత 18 ఏళ్ల గా పనిచేస్తున్న మున్సిపల్ అవుట్సోర్సింగ్ కార్మికులను భేషరతుగా పర్మినెంట్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు అజయ్ బాబు డిమాండ్ చేశారు. మున్సిపల్ రంగంలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘం ఏపీ మున్సిపల్ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కార్యాలయం ముందు జరిగిన ధర్నా ఏఐటీయూసీ ఆదోని పట్టణ కార్యదర్శి వెంకన్న అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు అజయ్ బాబు మాట్లాడుతూ గత నాలుగున్నర ఏళ్లుగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మున్సిపల్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తానని నమ్మబలికి మోసం చేశారన్నారు మున్సిపల్ కార్మికుల సమస్యలు ఏ ఒక్కటి పరిష్కరించలేదని తెలిపారు. అనంతరం మున్సిపల్ మేనేజర్ విజయ్ భాస్కర్ రెడ్డి కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు భీమేష్, ఉప ప్రధాన కార్యదర్శి ప్రకాష్, షేక్షావలి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు జాన్ బాబు,షేకన్న,శాంతప్ప మహేష్,నాగరాజ్, నాగమ్మ,సుశీలమ్మ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోండి

విశాలాంధ్ర - నందవరం : నందవరం కస్తూరిబా బాలికల గురుకుల పాఠశాల నందు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ గ్రూప్ నందు 30 సీట్లు ఖాళీగా ఉన్నాయని తల్లిదండ్రులు,విద్యార్థులు ఈ అవకాశంను సద్వినియోగం చేసుకోవాలని నందవరం కేజీబీవీ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ శైలజ పత్రికా ప్రకటనలో తెలిపారు. బుధవారం ఆమె ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఈ ప్రవేశాలకు కేవలం బాలికలు మాత్రమే నేరుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.ఇంటర్మీడియట్ నందు మొదటి సంవత్సరం ఎంపీసీ గ్రూప్ నకు దరఖాస్తు చేసుకునేవారు పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులన్నారు. ఆసక్తి గలవారు నేరుగా పాఠశాలకు వచ్చి కూడా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మిగతా వివరాలకు పాఠశాల ప్రిన్సిపల్ 9347696921 నెంబర్ ను గాని , కేజీబీవీ పాఠశాల సిబ్బందిని సంప్రదించాలన్నారు.

ఇన్స్పైర్ అవార్డులను రిజిస్ట్రేషన్ చేసుకోండి

విశాలాంధ్ర - కౌతాళం: కౌతాళం మండలంలోని ప్రైవేట్ పాఠశాలల హెచ్ఎం మీ మీ పాఠశాలల నుండి ఇన్స్పైర్ అవార్డుల గురించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని బుధవారం ఎంఆర్సి భవనంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మండల విద్యాశాఖ అధికారి శోభారాణి సూచించారు. విద్యార్థులను మంచి క్రమశిక్షణ నైతిక విలువలు గల విద్యాబోధన అందించి విద్యార్థులకు మంచి ఉన్నత భవిష్యత్తును అందించాలని సూచించారు. మంత్రాలయం నియోజకవర్గం అ పుష్మ,సెక్రటరీ సయ్యద్ దూద్ భాష, కరస్పాండెంట్ లింగన్న,గౌస్ మోదిన్,శ్రీనివాసులు,నాగార్జునరెడ్డి, సిద్ధన గౌడ్ పాల్గొన్నారు.

నూతన సచివాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - సి.బెళగల్ : మండల పరిధిలోని ఈర్లదిన్నె గ్రామంలో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని బుధవారం కోడుమూరు శాసనసభ్యులు జర దొడ్డి సుధాకర్ ప్రారంభించారు. అలాగే అదే గ్రామంలో కృష్ణారెడ్డి ఇంటి నుండి మారెమ్మ గుడి వరకు 10 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు నిర్మాణానికి కూడా ఆయన భూమి పూజ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే సుధాకర్ మాట్లాడుతూ గడపగడపకు నిర్వహించిన కార్యక్రమంలో ఆ గ్రామ ప్రజలు సిసి రోడ్డు నిర్మాణం చేపట్టాలని అడగడంతో బుధవారం ఆయన సీసీ రోడ్డుకు కూడా భూమి పూజ నిర్వహించారు. చింతమానుపల్లె గ్రామానికి చెందిన హెచ్ మంజుల దీర్ఘకాలిక క్యాన్సర్తో బాధపడుతుందని తెలిసిన ఎమ్మెల్యే ఆపరేషన్ నిమిత్తం సీఎం ఫండ్ నుండి 13 లక్షల రూపాయలు ఇప్పించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శ్యామల, ఎంపీపీ బొంతల మునెప్ప, ఈఓ ఆర్ డి సందీప్, పి ఆర్ఏ ఈ గంగరాజు, పంచాయతీ కార్యదర్శి బేగ్, ఏపీఎం వెంకటస్వామి, ఈర్లదిన్నె గ్రామ సర్పంచ్ పెద్దక్క వైయస్సార్ పార్టీ నాయకులు కృష్ణారెడ్డి, వెంకటేష్ రెడ్డి, సోమన్న తదితరులు పాల్గొన్నారు.

చర్చలు లేవ్ ఆమోదాలే...

▶60 అంశాలకు ఆమోదం తెలిపిన కౌన్సిల్

▶కౌన్సిల్ మీటింగ్ ఎందుకని టీడీపీ కార్పోరేటర్ ప్రశ్న

విశాలాంధ్ర- కర్నూల్ సిటీ : ప్రజాధనం ప్రతి పైసా విలువైనదే. ప్రజల నుంచి పన్నుల రూపంలో వచ్చిన ఆదాయాన్ని నగరపాలక సంస్థ అంతే జవాబుదారి తనంగా నగర అభివృద్ధి, పౌర సేవలకు ఖర్చు చేయాల్సింది. గడపగడపకు మన ప్రభుత్వం, జగనన్నకు చెబుదాం కార్యక్రమంతో పాటు ప్రజల నుండి వస్తున్న వినతుల ఆధారంగా అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాల్సి ఉంది. ఇందుకోసం యాక్షన్ ప్లాన్ లో పొందుపరిచిన అంశాల పై సర్వసభ్య సాధారణ సమావేశంలో చర్చించి సభ్యుల ఆమోదంతో తీర్మానాలను ఆమోదించాల్సి ఉంది. బుధవారం నగరంలోని యస్ బి ఐ కాలనీ నగరపాలక సంస్థ నూతన సమావేశ భవనంలో మేయర్ బి వై రామయ్య అధ్యక్షతన సర్వసభ్య సాధారణ సమావేశం జరిగింది. సమావేశంలో ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, హఫీజ్ ఖాన్, కమిషనర్ ఏ భార్గవ తేజలు పాల్గొన్నారు. ఇక్కడ చర్చలు లేవు అన్ని ఆమోదాలే అన్నట్లుగా అధికార వైసిపి సొంత వ్యవహారంలాగా సర్వేసభ్య సాధారణ సమావేశాన్ని నిర్వహించింది. నోటీసులో పొందుపరిచి సభ్యులకు సర్కులేట్ చేసిన 20 అంశాలతో పాటు మరో 40 అంశాలను టేబుల్ ఐటమ్ కింద చేర్చి కౌన్సిల్ ఆమోదం కొరకు సమావేశంలో ప్రవేశపెట్టారు. టేబుల్ ఐటమ్ కింద చేర్చిన 40 అంశాలపై టిడిపి ఫ్లోర్ లీడర్, 51 కార్పొరేటర్ మౌనిక రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఏకపక్షంగా తీర్మానాలను ఆమోదించుకునేందుకు సమావేశంలో చదవడం దేనికని టిడిపి కార్పొరేటర్లు ప్రశ్నించారు. అధికార పార్టీ కార్పొరేటర్లు కూడా అజెండాలోని అంశాలను సమగ్రంగా చదవాలని మేయర్ కు విజ్ఞప్తి చేశారు. ఇవేవీ పట్టించుకోకుండా 1గంట 50 నిమిషాల్లోనే అన్ని అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపిందని మేయర్ వెల్లడించారు. టేబుల్ ఐటమ్ కింద చేర్చిన అజెండాలోని అంశాలపై మేయర్ స్పందిస్తూ అభ్యంతరాలను లిఖితపూర్వంగా ఇస్తే సమాధానం చెబుతామని టిడిపి కార్పోరేటర్లకు సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కర్నూల్ నగర అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, టిడిపి వైసిపి అని తేడా లేకుండా అన్ని వార్డుల అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నామని మేయర్ చెప్పారు. తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం జగన్నాథ గట్టు సమీపంలో 130 కోట్లతో 17 ఓ హెచ్ ఆర్ ఎస్ ట్యాంకులు, 35 వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ల నిర్మాణం కోసం డి పి ఆర్ తయారుచేసి ప్రభుత్వానికి పంపడం జరిగిందన్నారు. వాటికి ఆమోదం వచ్చిన వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామన్నారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కన్నా కర్నూల్ మున్సిపల్ కార్పొరేషన్ లోనే చెత్త పన్ను అధికంగా ఉందని, మురికివాడలో 30 రూపాయలు, ఇతర ఏరియాలో 60 రూపాయలకు చెత్త పన్ను పరిమితం చేస్తూ కౌన్సిల్ తీర్మానం చేయాలని ఎమ్మెల్యే కాటసాని రాంపాల్ రెడ్డి సూచించారు. నగరపాలక సంస్థలో కొత్తగా విలీనమైన పందిపాడు, లక్ష్మీపురం,పెద్దపాడు గ్రామాల ప్రజలు ఇంటి పన్నులు చూస్తేనే బెంబేలెత్తిపోతున్నారని, విలీన గ్రామాల్లో ఇంటి పన్నులను సమీక్షించాలని ఎమ్మెల్యే కమిషనర్ ను కోరారు. లక్ష్మీపురంలో కలుషిత నీరు వస్తుందని, రక్షిత నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు. వీకర్ సెక్షన్ కాలనీలో త్రాగునీటి పైప్లైన్ డ్రైనేజీ లో వేయడం వల్ల మురుకునీరు కలిసి తాగునీరు కలిసిదమవుతుందని, తక్షణమే అక్కడి నుండి పైప్లైన్ మరోచోటకు మార్చాలని ఆయన కోరారు.చరిత్రలో ఎప్పుడు లేని విధంగా కర్నూలు నగల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నిధులు ఇస్తున్నారని ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ చెప్పారు. ప్రతిదానికి అడ్డు పడుతూ టిడిపి నాయకులు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు.టిడిపి తరఫున గెలుపొందిన వార్డుల్లో అభివృద్ధికి నిధులు ఇవ్వడం లేదని కార్పొరేటర్లు కురువ పరమేష్, విజయ ప్రత్యూషలు వాపోయారు. అధికారులను బ్రతిమాలుకొని వార్డులో వీధిలైట్లు వేయించుకుంటే, వారెవరు వేయించుకోవడానికి అంటూ కరెంటు కట్ చేయించి ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని 52వ వార్డు కార్పొరేటర్ విజయ ప్రత్యూష ఆవేదన వ్యక్తం చేశారు. స్మశాన వాటికలో గుంతకు రూ10వేలు సమాధికి అయితే రూ50 వేలు అడ్డగోలుగా వసూలు చేస్తూ ప్రజల్ని ఇబ్బంది పెడుతున్నారని 12వ వార్డు కార్పొరేటర్ క్రాంతి కుమార్ చెప్పారు. స్మశాన వాటికల నిర్వహణ బాధ్యతను నగరపాలక సంస్థ తీసుకొని ధరల పట్టికను ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ కోరారు. లక్ష్మీపురంలో బోరు మోటర్ కాలిపోయినప్పుడు తాగునీటికి ఇబ్బంది ఏర్పడడంతో పాటు లేబర్ ఖర్చులు కూడా అధికంగా వస్తున్నాయని, ప్రత్యామ్నాయంగా మరో మోటారు ఏర్పాటు చేయాలని 28వ వార్డు కార్పొరేటర్ నారాయణరెడ్డి కోరారు. సమావేశంలో కమిషనర్ అడిషనల్ కమిషనర్ పివి రామలింగేశ్వర్, ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక,రెవెన్యూ, హెల్త్ శాఖల అధికారులు సిబ్బంది, గృహ నిర్మాణ సంస్థ, ఏపీఎస్పీడీసీఎల్ అధికారులు, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీపీఐ బస్సుయాత్రను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - కోడుమూరు : రాష్ట్రాన్ని రక్షించండి - దేశాన్ని కాపాడండి అంటూ సిపిఐ తలపెట్టిన బస్సు యాత్రను జయప్రదం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి రాజు పిలుపునిచ్చారు.సిపిఐ నాయకులు, కార్యకర్తలు బుధవారం పట్టణంలోని స్థానిక ఏటియుసి కార్యాలయం వద్ద బస్సు యాత్ర పోస్టర్లను విడుదల చేశారు.అలాగే బస్సు యాత్రను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న పాలక ప్రభుత్వాలను ఇంటికి సాగనంపాలని కోరారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి పదివేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.రైతులు బ్యాంకుల్లో తీసుకున్న పంట రుణాలు అన్నింటిని మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 2న బస్సు యాత్ర కోడుమూరుకు వస్తుందని,ఇక్కడ జరిగే బస్సు యాత్ర బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ నాయకులు రాముడు,హమాలి సంఘం నాయకులు బజారి,ఏఐటీయూసీ నాయకులు మద్దూరు రాముడు,ఆటో వర్కర్స్ యూనియ న్ నాయకులు మధు,ఏఐఎస్ఎఫ్ నాయకులు రంగస్వామి,హమాలి కార్మికులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - దేవనకొండ రూరల్ : జిల్లాలో పెండింగులో ఉన్న సాగునీటి ప్రాజెక్టులపై సెప్టెంబర్ 2న ఆలూరులో సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కే. మద్దిలేటిశెట్టి, మండల కార్యదర్శి ఎమ్.నరసరావు పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఈనెల 17 నుండి ప్రజా కార్మిక, కర్షక సమస్యల పరిష్కారం కొరకు ప్రారంభమైన బస్సుజాత సెప్టెంబర్ 2న ఆలూరుకు రానున్న సందర్భముగా సిపిఐ కోటకొండలో,గుడిమిరాళ్లలో శాఖ సమావేశము బుధవారం పార్టీ నాయకులతో కలిసి నిర్వహించారు.ఈ కార్యక్రమం లో సిపిఐ శాఖ సహాయ కార్యదర్శి రామన్న, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు జక్కల హరిశ్చంద్ర , ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు గిరిబాబు,ప్రజాసంఘాల నాయకులు ఆచారి, పాల్గొన్నారు.

విశాలాంధ్ర- పత్తికొండ: రాష్ట్రాన్ని రక్షించండి- దేశాన్ని కాపాడండి అంటూ సిపిఐ తలపెట్టిన బస్సు యాత్రను జయప్రదం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి డి.రాజా సాహెబ్ పిలుపునిచ్చారు. సిపిఐ ప్రతినిధి బృందం బుధవారం పట్టణంలోని ప్రధాన కూడళ్లలో బస్సు యాత్రను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హంద్రీనీవా ద్వారా పత్తికొండ నియోజకవర్గం లో ఉన్న చెరువులన్నింటికీ నీళ్ల నింపాలన్నారు. పందికోన, క్రిష్ణగిరి రిజర్వాయర్ కింద ఉన్న కుడి, ఎడమ కాలువ స్థిరీకరణ పనులను పూర్తి చేసి పంట పొలాలకు సాగునీరు అందించాల న్నారు. పత్తికొండలో టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ, పాలిటెక్నిక్ కళాశాల, సీనియర్ సివిల్ కోర్ట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి పదివేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులు బ్యాంకుల్లో తీసుకున్న పంట రుణాలు అన్నింటిని మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 2న బస్సు యాత్ర పత్తికొండకు వస్తుందని, పత్తికొండలో జరిగే బస్సు యాత్ర బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ తాలూకా అధ్యక్షులు నెట్టికంటయ్య, నాయకులు మాదన్న, నాగరాజు, ఉచ్చన్న, తదితరులు పాల్గొన్నారు.

యాభై ఏళ్ళుగా సైకిల్ పై ' సవారి '

సైకిల్ పై వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఖాజా మోదీన్

విశాలాంధ్ర-కోసిగి : ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో చిన్న పెద్ద అని తేడా లేకుండామార్కెట్లో వస్తున్న కొత్త కొత్త వాహనాలతో యువత దూసుకెళుంది. కర్నూలు జిల్లా కోసిగి గ్రామానికి చెందిన టంకం.ఖాజా మోదీన్ అనే వ్యక్తి 50 యేళ్ళ గా సైకిల్ పై సవారి చేస్తూ మండలంలోని గ్రామాల్లో ఉదయాన్నే ఆరు గంటలకు బయలుదేరి చిరు వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సైకిల్ పై రోజు 15 నుంచి 20 కిలోమీటర్లు గ్రామాల్లో తిరుగుతూ బ్రెడ్లు, బిస్కెట్లు,మిఠాయిలు వంటి సరుకులు అమ్ముతున్నాడు. ప్రస్తుతం అతని వయస్సు 78 సంవత్సరాలు అయినా యువకుడు గా సైకిల్ తొక్కుతూ వ్యాపారం చేస్తున్నాడు. నేటికీ సైకిల్ చెక్కుచెదరకుండా రిపేరు వచ్చినప్పుడల్లా చేయిస్తూ సైకిల్ పైన సవారీ చేస్తున్నాడు. ప్రతి ఏడాది టైర్లు,టూపులు మాత్రమే మారుస్తున్నట్లు తెలిపాడు. సైకిల్ తొక్కడం వల్ల శరీరంలో అన్ని అవయవాలు బాగా కదిలికలు అయి, మంచి వ్యాయామం చేసినట్లు ఉంటుందని, చిన్నప్పటి నుంచి సైకిల్ తొక్కడం అలవాటుగా మారిందన్నాడు. అప్పట్లో సైకిల్ ఉన్న కుటుంబం మంచి డబ్బున్న కుటుంబం గా చూసేవారన్నాడు. ప్రస్తుత కాలంలో సైకిల్ కు నేటికి ఆదరణ తగ్గలేదని తెలియజేశాడు. సైకిల్ పైనే జీవనం చేస్తూ నలుగురు కొడుకులను , ఇద్దరు కూతుళ్లకు పెళ్లిళ్లు సైతం చేశానన్నాడు. ఇన్నేళ్ల నుంచి సైకిల్ పై సవారి చేస్తున్న ఖాజ మోదీన్ ను చూసి మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ఇళ్ల నిర్మాణాల వారాంతపు పురోగతి పై ప్రత్యేక దృష్టి సారించండి

▶ జిల్లా ఇంఛార్జి కలెక్టర్ నారపురెడ్డి మౌర్య

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ఇళ్ల నిర్మాణాలలో వారాంతపు పురోగతి పై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఇంఛార్జి కలెక్టర్ నారపురెడ్డి మౌర్య హౌసింగ్ అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో నవరత్నాలు-పేదలందరికీ ఇళ్ల నిర్మాణాల పురోగతి పై హౌసింగ్ అధికారులతో జిల్లా ఇంఛార్జి కలెక్టర్ నారపురెడ్డి మౌర్య సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఇంఛార్జి కలెక్టర్ మాట్లాడుతూ హౌసింగ్ అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సమన్వయంతో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆప్షన్-3 ఇళ్ల నిర్మాణాలను కూడా సంబంధిత కాంట్రాక్టర్లచే వేగవంతంగా పూర్తి చేసేలా చూడాలన్నారు. కౌతాళం మండలంలో ఇళ్ల నిర్మాణాలను పెంచే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి అయిన వాటికి త్వరితగతిన విద్యుత్ సరఫరా అందజేయాలన్నారు. ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసేందుకు గాను స్వయం సహాయక సంఘాల మహిళల ద్వారా బ్రిక్ ప్లాంట్స్ ఏర్పాటు చేసేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలని జిల్లా ఇంఛార్జి కలెక్టర్ సూచించారు. ఆదోని లేఅవుట్ పరిసరాల్లో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం జరుగుతున్నందున పనులలో కొంత మేరకు జాప్యం జరిగింది హౌసింగ్ అధికారులు జిల్లా ఇంఛార్జి కలెక్టర్ కు తెలుపగా ప్రత్యామ్నాయంగా వేరొక చోట నుండి లైన్ ఏర్పాటు చేసుకొని పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఆలూరు, చిప్పగిరి మండలాల నందు బేస్మెంట్ లెవెల్ లో ఉన్న నిర్మాణాలను రూఫ్ లెవెల్ కు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓర్వకల్లు లేఅవుట్ నందు పూర్తి అయిన ఇళ్ల నిర్మాణాలకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు అందజేయడంతో పాటు రూఫ్ లెవెల్ స్థాయిలో ఉన్న నిర్మాణాలను పూర్తి చేయడంతో పాటు ఆర్చి నిర్మాణాన్ని కూడా త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ ఎస్ఈ ని జిల్లా ఇంఛార్జి కలెక్టర్ ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ఇసుక సరఫరాలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని జిల్లా ఇంఛార్జి కలెక్టర్ అడుగగా, ఇసుకకు సంబంధించి ఎటువంటి ఇబ్బంది లేదని హౌసింగ్ అధికారులు తెలిపారు.ఈ సమావేశంలో హౌసింగ్ స్పెషల్ ఆఫీసర్ మల్లిఖార్జునుడు, పంచాయతీ రాజ్ ఎస్ఈ సుబ్రమణ్యం, హౌసింగ్ ఇంఛార్జి పిడి సిద్దలింగ మూర్తి, ఈఈ నాగరాజు, ఆదోని, ఎమ్మిగనూరు మండలాల హౌసింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సర్వే నెంబర్ల స్థానంలో ఎల్పీఎం నెంబర్లు

విశాలాంధ్ర - సి.బెళగల్ : ఇటీవల జరిగిన రీ సర్వే పూర్తికావడంతో ఆ సర్వే నంబర్ల స్థానంలో ఎల్పీఎం నెంబర్లు కేటాయించడం జరిగిందని మండల తహశీల్దార్ శేష ఫణి అన్నారు. బుధవారం సి.బెళగల్ మండల పరిధిలోని పలుకు దొడ్డి గ్రామంలో గ్రామ సభ నిర్వహించి ఆ గ్రామసభలో వారు రాజపత్రం రీసర్వే నోటిఫికేషన్ సరిహద్దుల చట్టం 1923 లోని సెక్షన్ 13 ప్రకారం పూర్తి విస్తీర్ణం 38 77. 13 ఎకరముల భూమికి సర్వే నిర్వహించడం జరిగిందని అందువలన సర్వే సంబర్ల స్థానంలో ఎల్పీఎం సంబర్లు కేటాయించారు. దీనికి సంబంధించి రైతు వారి పేర్ల ప్రకారం వారికి సర్వేలో వచ్చిన విస్తీర్ణాలను పలుకు దొడ్డి గ్రామంలో గ్రామసభ నిర్వహించి రైతులకు చదివి వినిపించడమైనది. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శేషఫణి, డిప్యూటీ తహసిల్దార్ కృష్ణమూర్తి, మండల సర్వేయర్ నాగభూషణం, గ్రామ రెవెన్యూ అధికారి శ్రీనివాసులు మరియు గ్రామ సర్వేయర్ నరసింహులు ,పలుకు దొడ్డి సంఘాల గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

విశాలాంధ్ర-కర్నూల్ లీగల్ : పాణ్యం నియోజకవర్గ పరిధిలోని ముగ్గురికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద వచ్చిన రూ 3,60,000/- సంబంధిత చెక్కులను అర్హులకు అందజేసిన,పాణ్యం ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి ప్రజలు గుండెల్లో నిల్చుకుపోయారన్నారు.సీఎం చేస్తున్న పథకాలు చాలా మంచిగా ఉన్నాయని వారు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సల్కాపురం సర్పంచ్ మద్దిలేటి ,కార్పొరేటర్ దండు లక్ష్మి ,కాంత్ రెడ్డి పాల్గొన్నారు.

నవరత్నాలతో సంక్షేమ వెలుగులు...

విశాలాంధ్ర - వెల్దుర్తి రూరల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తీసుకొచ్చిన నవరత్నాల పథకాలతో పేదల ఇళ్లలో సంక్షేమ వెలుగులు నింపారనిఎమ్మెల్యే శ్రీదేవి అన్నారు. మండల పరిధిలోని లక్ష్మీ నగరం గ్రామంలో గడప గడపకుమన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మాజీ జెడ్పిటిసి సచివాలయ గృహసారుదుల కన్వీనర్ దేశాయి సమీర్ రెడ్డి, ఎమ్మెల్యే శ్రీదేవికి ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూదే పల్లె శరభ రెడ్డి,కొత్తూరు వెంకటేష్ రెడ్డి,అల్లుగుండు శ్రీరామ్ రెడ్డి, పుల్లగుమ్మి నాగార్జునరెడ్డి బోయినపల్లె అశోక్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఈఓఆర్డినరసింహులు,ఎపిఓ రాజు నాయక్ పాల్గొన్నారు.

హెూరాహెూరీగా కూరగాయల మార్కెట్ వేలం

విశాలాంధ్ర-ఆస్పరి: మండల కేంద్రంలోని స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణంలో బుధవారం నిర్వహించిన కూరగాయల మార్కెట్ వేలం పాట హెూరాహెూరగా సాగింది. జిల్లా పంచాయతీ అధికారుల ఆదేశాల మేరకు పత్తికొండ డి.ఎల్.పి.ఓ ప్రకాష్ నాయుడు ఆధ్వర్యంలో సర్పంచ్ మూలింటి రాధమ్మ అధ్యక్షతన ఈ కూరగాయల మార్కెట్ వేలం పాటను నిర్వహించారు.ఈ వేలం పాటలో మొత్తం 5 మంది పాటదారులు పాల్గొనగా వైయస్సార్సీపి మద్దతుదారుడు బొల్లారు ఆంజినేయులు రూ.56,01,000 లక్షలకు పాట పాడి దక్కించుకున్నారు. ఈ సందర్భంగా డి.ఎల్.పి.ఓ ప్రకాష్ నాయుడు,జిల్లా కేడిసిసి డైరెక్టర్ మూలింటి రాఘవేంద్రలు మాట్లాడుతూ మేజర్ గ్రామ పంచాయతీ తీర్మానం మేరకు కూరగాయల మార్కెట్ వేలం పాటలో వచ్చిన నగదులో 25% అనగా ఊరు వాకిలి నిర్మాణం కోసం రూ.14 లక్షలు కేటాయిస్తున్నామని తెలిపారు. మిగిలిన నగదు రూ.42,01,000 లక్షలు పంచాయతీకి జమ చేస్తామన్నారు.గతంలో కంటే ఈ సంవత్సరం గ్రామపంచాయతీకి 51వేలు అదనంగా ఆదాయం సమకూరినట్లు వారు తెలిపారు. ఈ వేలంపాటలో జడ్పిటిసి దొరబాబు, సొసైటీ చైర్మన్ కట్టెల గోవర్ధన్, సీఈఓ అశోక్ నాయుడు, మాజీ ఎంపీపీ రత్నమ్మ భర్త మాజీ డైరెక్టర్ కృష్ణ యాదవ్, టిడిపి మాజీ మండల కన్వీనర్ తిమ్మన్న,పాల్గొన్నారు. ఈ వేలం పాటలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆస్పరి, చిప్పగిరి ఎస్సైలు వరప్రసాద్, రమేష్ బాబు పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.